# ★ విషాదాంతం ★

★ రాజా ★

తెల్లవారుతూనే లేచి కిటికీలోంచి చూశాడు ప్రకాశం. ఇంకా తెల్లారలేదు బహుశా అయిదయి ఉంటుందనుకున్నాడు.

అతనిభార్య లక్ష్మి యింకా పడుకునే ఉంది. ఆమెని ఏమాత్రమూ లేపడం యిష్టలేక అతను చప్పుడు చెయ్యకుండా తలుపుతీసుకుని బయటికి వచ్చి, కొళాయి క్రింద దోశిలిపెట్టి కడుపునిండా నీళ్లు తాగాడు.

కాని నీళ్లు తాగితే ఆకలి తీరుతుందా? కాని మరో గత్యంతరం ఏముంది? అతనికి పని ఉన్నన్నాళ్లూ అతను ఏదోవిధంగా తెల్లారి లేచి, భార్య యిచ్చిన కాఫీతాగి కాగితాలూ, కలాలూ పుచ్చుకుని ఉద్యోగార్థం బయలుదేరేవాడు. కాని వారం రోజులాయి అతనిదివరకు పనిచేస్తున్న కంపెనీ దివాలా ఎత్తింది అంచేత అతను చేతికి పనిలేకపోగా, తన జీతమే కొంత నష్టంరాగా యిలాంటి పాట్లన్నీ పడాల్సివచ్చింది.

అతను నీళ్లుతాగి వచ్చేంతలోకే లక్ష్మిలేచి, కాఫీ చెయ్యడానికని నిప్పు రాజేస్తోంది తడి కర్రల్లో కళ్లుమండిపోతూ ఆమె అలానే ఊత్తోంది ఎందుకో ఆమెకి తెల్లారుతూనే ఈ అవస్థ? అతను ఇంతకుముందు పందసార్లన్నా చెప్పేఉంటాడు. "ఎందుకు లక్ష్మి, తెల్లార్లూనే కాఫీలూ? అంతగా అవసరమైతే ఎక్కడో ఓ చోట తాగుతాన్లే. నీకు ఒంట్లో ఏమీ బాగాలేదని చెప్పాడు డాక్టరు బాగా విశ్రాంతితీసుకోవాలిట. ఎందుకు యింకా నీకీ లేనిపోని హైరాన?" అని కాని ఆమె వినదు అతను తనచేతిమీద యిస్తేనేగాని మరోచోట ఎక్కడా కాఫీ తాగడని ఆమె నమ్మకం.

లక్ష్మికి ఒంట్లో బాగాలేదన్నమాట యదార్థమే. డాక్టరు నెలరోజుల క్రిందటే ఆమెకి ఆపరేషన్ అవసరమని చెప్పాడు. లక్ష్మికి ఆపరేషన్ అంటే భయం. భర్త ఎంతచెప్పినా వద్దంది తనకేమీ బాధలేదంది ఒంట్లో నలత ఆ రోజు కారోజు పెరిగిపోతున్నా ఆమె తనకి బాధ లేనట్టు నటిస్తోంది. బాధంతా కప్పిపుచ్చుకుంటోంది

అతను చెదలుపట్టి బూజులు పడుతూన్న కిటికీలోంచి రోడ్డుకేసి చూశాడు, ట్రాములు బయలుదేరుతున్నాయి తన ప్రయత్నానికి తనూ బయల్దేరే వేళయింది

ఇంతట్లోకే లక్ష్మి వేడివేడి కాఫీ యిత్తడి గ్లాసులో పోసి కొంగుతో పట్టుకునివచ్చింది. ఆమె అమాకపు ప్రేమచూసి ప్రకాశం జాలిగా నవ్వుకున్నాడు.

ఇక అతను బయలుదేరాలి. లక్ష్మి యిచ్చిన కాఫీ పూర్తిచేసి ఉద్యోతయత్నార్థం బయలుదేరడానికి గడ్డం తడిమిచూసుకున్నాడు, ఆట్టే మాయలేదు. అతను తన పాతకోటు తొడుక్కుంటూ బయలుదేరాడు. వెడుతూ "లక్ష్మి, వెడుతున్నాను. ఈవాళన్నా ఏదయినా దొరుకుతుందో దొరకదో!" అన్నాడు

లక్ష్మి వెంటనే "తప్పకుండా దొరుకుతుంది, క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరండి" అంది,

ఆమె ఆశీర్వచనప్రభావమేమో, అతనికిన్నాళ్ళూ తిరిగినా దొరకని ఉద్యోగం ఆవేళ ఖాళీగా ఉన్నట్టు తెలిసివచ్చింది. అతను వడిగా అడుగు లేసుకుంటూ ఆ చోటికి వెళ్లాడు.

అతను బయటనిలబడిఉన్న మనుష్యులతోపాటు క్యూలో నిలబడ్డాడు. అతని ఛాన్సు వచ్చేసరికి ఒకగంట అయింది. మేనేజర్ని చూస్తూనే అతని సర్టిఫికేట్లన్నీ ఆయనముందు గుమ్మరించాడు.

మేనేజర్ వాటిని పరీక్షగా చూసి, "ఆల్ రైట్ నిన్ను రాత్రిపూట గుమాస్తాగా వేసుకున్నాం. ఏమంటే ఈ ఫ్యాక్టరీ రాత్రింబవళ్లు పని చేస్తోంది. నెల్లకు నూఱురూపాయలు జీతం. నువ్వు ఈ రాత్రి ఎనిమిదింటికల్లా వచ్చి డ్యూటీలో హాజరుకావాలి. లేకపోయినట్టయితే వేరే ఒకర్ని చూసుకుంటాం" అని చెప్పాడు.

ప్రకాశం ఆయనదగ్గిర కృతజ్ఞతాపూర్వకంగా శలవుతీసుకుని బయలుదేరాడు ఆ వెళ్ళడం తిన్నగా ఒక సెట్టిదగ్గిరకి వెళ్ళి యేభై రూపాయలు అప్పు తీసుకువచ్చి భార్యకొక మంచిచీరా, ఒక గడియారం, గులాబ్‌జాములూ, తనకొక సిగరెట్ ప్యాకెట్టూ కొని తిన్నగా యింటికి వచ్చాడు.

అతను తలుపుకొడుతూనే తీసింది లక్ష్మి. ఉద్యోగం వచ్చిందా అనే సంగతి అడగలేదు. అతని ధోరణిచూస్తూనే అంతా తెలిసింది. అతను గబగబా కోటువిప్పి కుర్చీకి తగిలించి, పార్సిల్సు ఒక్కొక్కటే ఇప్పుతున్నాడు; "లక్ష్మి, యింక మన కష్టాలు గట్టెక్కినట్టే విన్నాక రాణీని చేస్తాను" అన్నాడు ఉత్సాహంగా.

"ఎక్కడా పనీ?" అందామె ప్రయత్నంగా చిరునవ్వు తెచ్చుకో ప్రయత్నిస్తూ, ఆమెకళ్లు కొద్దిగా చెమర్చాయి.

"ఒకమిల్లులో గుమాస్తాపని. నూరురూపాయలు జీతం" ఆమె అతన్ని ఆవేశంతో కౌగలించుకుని ఏడ్చింది, "ఆడవాళ్ళ కెక్కువ సంతోషమొస్తే ఏడుస్తారు గాబోలు" అనుకున్నాడు ప్రకాశం

కొద్దిసేపయ్యాక ఆమె, "మీరు ముందర స్నానం చెయ్యండి. తర్వాత భోజనం చేద్దురుగాని" అని చెప్పి నీళ్లు తోడడానికని నూతిదగ్గిరకి వెళ్ళింది.

ఇంతలో అతనికళ్లు అక్కడ ఒక కాపడం కాస్తోన్న గుడ్డమీద పడ్డాయి. దాన్ని ముట్టుకున్నాడు. చాలా వేడిగా ఉంది, అతనను కున్నాడు. "పాపం లక్ష్మి నేను వస్తూనే కాపడం కూడా మానేసి తనకి ఒంట్లో బాగున్నట్టు నటిస్తోంది కాబోలు. ఈ బలహీనతకి ఈ పనులుకూడా తోడయితే కష్టం!" అని

అతను స్నానంచేసి మంచి బట్టలు వేసుకున్నాడు, ఆమెకూడా కొత్తచీర కట్టుకుని చాలా అందంగా కనుపించింది, కాని ఆమె తెల్లటి పాలిపోయిన మొహంలో ఏదో బాధ ఉందని అతనికి తెలిసి వచ్చింది,

భోజనంచేస్తూ అతను "ఈ రాత్రిడ్యూటీ అయ్యాక రేపు ప్రొద్దున్నే లక్ష్మిని తీసికెళ్ళి శ్రద్ధగా డాక్టరుచేత వైద్యం చేయిద్దాం'' అనుకున్నాడు.

తాంబూలం వేసుకుంటూ ప్రకాశం ఆమెనడిగాడు. "నిజం చెప్పు. నువ్వు సరిగ్గా కాపడం పెట్టుకోలేదు కదూ?"

ఆమె కాస్త తెల్లబోయి ఇంతలో సర్దుకుని "కాపడం అంతా అయ్యాకే వచ్చారు మీరు. ఒకసారి కడుపులో పోటు వచ్చింది. తర్వాత యిప్పుడంతా తగ్గిపోయింది" అంది,

అతను నైట్ డ్యూటీకని పెందరాళే ఆరు గంటలకి భోజనం చేస్తున్నాడు ఆవేళ సాయింత్రం యింతలోకే ఆమె పులుసు వడ్డిస్తూ రెండోచేత్తో డొక్క పట్టుకుని నేలమీద అలానే మూర్ఛ పడిపోయింది.

ప్రసాద్ ఖంగారుగా చెయ్యి కడుక్కుని, ఆమెని మంచంమీద పడుకోబెట్టి డాక్టర్‌కోసం పరిగెత్తాడు.

డాక్టరు నాడిచూచి, "చాలారోజులక్రితమే ఆపరేషన్ చెయ్యాల్సింది. అది చాలా ముదిరింది అయినా ప్రయత్నిస్తాను.'' అన్నాడే,

కొద్దిసేపట్లో కెవ్వుమనే కేక!

ఇంతలో గడియారం అలారం కొట్టింది, ఎనిమిదయ్యిందనే సూచనగా,